

రాయలసీమ దరువు

APTEL/26/A7874

www.rayalaseemadaruvu.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

నూతనంగా వెలువడుతున్న 'రాయలసీమ దరువు' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.

చట్టాలపై అవగాహన ఉండి రాజకీయ విశ్లేషణ, సమస్యల పట్ల అవగాహన, వినూత్న శైలిలో వార్తలు రాయగలిగే వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి

94940 39030
85010 70080

ప్రచురణ : శ్రీ సత్యసాయి /అనంతపురం | ఎడిటర్ : ఎనుముల కుల్లాయప్ప | గురువారం 29 అక్టోబర్ 2026 | సంపుటి : 01, సంచిక : 38 | పేజీలు : 04, వెల రూ.2



తెలంగాణలో భారీగా

ఐపీఎస్‌ల బదిలీలు

- కీలక శాఖలకు కొత్త అధికారులు
- కీలక శాఖలకు కొత్త అధికారులను నియమించిన ప్రభుత్వం
- పంచాయతీరాజ్ శాఖకు నవీన్ మిట్టల్
- జీహెచ్ఎంసీ బాధ్యతలు సర్ఫరాజ్ అహ్మద్‌కు

హైదరాబాద్ :

తెలంగాణ ప్రభుత్వంలో పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. కీలక శాఖలకు నూతన అధికారులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. - మిగతా 2 లో

తెలంగాణ రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది



- కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం
- మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను దిగ్బంధించారన్న హరీశ్
- కరవుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడం చేతకాని ప్రభుత్వమని విమర్శ
- ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్న

హైదరాబాద్ :

మూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేశారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. - మిగతా 2 లో

తెలంగాణలో 'ఏఐ సాక్షమ్'

- ప్రభుత్వ సేవల్లో ఏఐ కార్యక్రమం ప్రారంభం
- పారదర్శకం చేసే లక్ష్యంతో ప్రభుత్వం 'ఏఐ సాక్షమ్' కార్యక్రమానికి శ్రీకారం
- 'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ప్రారంభించిన మల్లు భట్టి విక్రమార్క
- రైతులు, పింఛనుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలన్న డిప్యూటీ సీఎం
- ప్రజల డేటా భద్రతకే అత్యధిక ప్రాధాన్యమని వెల్లడి



హైదరాబాద్ :

తెలంగాణలో ప్రభుత్వ సేవలను మరింత వేగవంతం, పారదర్శకం చేసే లక్ష్యంతో ప్రభుత్వం 'ఏఐ సాక్షమ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో ప్రారంభించారు. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం యొక్క ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో జరిగిన ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల - మిగతా 2 లో

ఆంధ్రప్రదేశ్ తీరాన్ని వణికించిన అర్నబ్

- నవంబర్ 3 వరకు వర్షాలు
- అర్నబ్ తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరాన్ని వణికించింది
- తీరప్రాంతాల్లో అలల ఉద్ధృతి మీటరు వరకు ఎగసిపడుతున్నాయన్నారు
- గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో గరిష్టంగా 150 కిలోమీటర్ల వేగంతో భీకర ఈదురుగాలులు
- నవంబర్ 3 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- కోస్తాంధ్ర, యానాంలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
- పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు



అమరావతి :

అర్నబ్ తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరాన్ని వణికించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కదిలిన ఈ తీవ్ర తుపాను తీరం దాటే సమయంలో గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో గరిష్టంగా 150 కిలోమీటర్ల వేగంతో భీకర ఈదురుగాలులు వీచాయి. 48 గంటల్లో తుపాను బలహీనపడనుందని ఐఎండీ శాస్త్రవేత్తలు అంచనా వేశారు.కోస్తాంధ్ర-యానాం ప్రాంతాలలో ఈనెల 30 నుంచి నవంబర్ 3 వరకు, తెలంగాణలో ఈనెల 29 నుంచి నవంబర్ 3 వరకు, రాయలసీమ, తమిళనాడు, పుదుచ్చేరి, - మిగతా 2 లో

ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ

ఎన్నికలు వాయిదా

- కొత్త తేదీలు ప్రకటన
- పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలలో మార్పులు
- రాష్ట్రంలో జరగనున్న జిల్లా, మండల పరిషత్ ఎన్నికల తేదీల్లో మార్పులు చోటుచేసుకున్నాయి
- నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నవంబర్ 7న కౌంటింగ్ నిర్వహించనున్నారు



అమరావతి :

రాష్ట్రంలో జిల్లా, మండల పరిషత్ ఎన్నికల పోలింగ్‌ను రీషెడ్యూల్ చేశారు. ఈ మేరకు కొత్త తేదీలను ప్రకటించారు. నవంబర్ 3న జరగాల్సిన పోలింగ్‌ను నవంబర్ 5కు, నవంబర్ 5న జరగాల్సిన కౌంటింగ్‌ను నవంబర్ 7కు రీషెడ్యూల్ చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఓ ప్రకటన విడుదల చేశారు. మరోవైపు పట్టణ స్థానిక - మిగతా 2 లో

శిక్షణ కోసం భారత్ వైపు

జపాన్ చూపు



తుపాను పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష



- సెక్రటేరియట్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- అర్నబ్ తుపాను పరిస్థితిపై ఆర్టీజీఎస్‌లో సమీక్ష
- కూలిన చెట్లను వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశం
- రవాణా వ్యవస్థను తక్షణం పునరుద్ధరించాలని సూచన
- మనమిత్ర యాప్ ద్వారా ఫిర్యాదుల త్వరితగతిన పరిష్కారం

అమరావతి :

ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయానికి చేరుకుని, 'అర్నబ్' తుపాన్ ప్రభావిత జిల్లాల్లోని పరిస్థితిపై ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. 'రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ' (ఆర్టీజీఎస్) కేంద్రం నుంచి సీసీ కెమెరాల ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితులను ఆయన నేరుగా పరిశీలించారు.తుపాను గమనం, ప్రస్తుత పరిస్థితి, క్షేత్రస్థాయిలో - మిగతా 2 లో

బ్యాలెట్‌తో ఎన్నికలు జరిగినా

ఓటమి తప్పలేదుగా




- మోనోకిల్ ఎమోజీతో కాంగ్రెస్‌పై మోదీ సెటైర్
- నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు
- 12 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్
- కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కని వైనం
- ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతో జరిగాయని గుర్తుచేసిన ప్రధాని మోదీ

ఢిల్లీ :

నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేకపోయింది. ఈ ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యంగా స్పందించారు. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగాయని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ ఎన్ని స్థానాలు గెలిచిందో ఊహించాలంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి 'మోనోకిల్' ఎమోజీని జతచేశారు.ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక - మిగతా 2 లో

స్పెయిన్‌లో ఘోర రైలు ప్రమాదం..

రెండు హైస్పీడ్ రైళ్లు ఢీ



- ప్రమాదంలో 64 మంది మృతి
- టోలెడో ప్రావిన్స్‌లోని ఉర్దా స్టేషన్ సమీపంలో ఈ ఘటన
- ప్రమాద సమయంలో రైళ్లలో 544 మంది ప్రయాణికులు
- మాడ్రిడ్-అండలూసియా మార్గంలో రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిపివేత
- సహాయక చర్యలు కొనసాగుతున్నాయి

ఢిల్లీ :

స్పెయిన్ టోలెడో ప్రావిన్స్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. రెండు - మిగతా 2 లో

తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం

- ఉత్తరాంధ్రను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను
- విపత్తులో ఏపీకి సాయం చేసేందుకు ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వం
- ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి
- విద్యుత్ పునరుద్ధరణ పనులకు సిబ్బంది, సామగ్రి పంపుతామని హామీ
- తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి గొట్టిపాటి
- సహాయక చర్యల కోసం 6,000 మంది సిబ్బందిని మోహరించిన ఏపీ ప్రభుత్వం

హైదరాబాద్ :

అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు, - మిగతా 2 లో



సంపాదకీయం

యువకెరటం జయకేతనం!

శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ తర్వాత మరో దేశమైన సెర్బియాలో సైతం యువతరం తడాఖా చూపింది. ఆగ్నేయ యూరోప్‌లో డాన్యూబ్, సావా నదుల సంగమస్థలమైన దాని రాజధాని నగరం బెల్‌గ్రేడ్ సోమవారం లక్షలమంది జనంతో ఉప్పొంగిపోయింది. ఒక నాయకుడంటూ లేకుండా, నిర్దిష్టమైన విధివిధానాలు రూపొందించుకోకుండా విద్యార్థులు ఏకమై నెలకొల్పిన స్టూడెంట్ లిస్ట్ పార్టీ 53.3 శాతం ఓట్లతో, 140 స్థానాల్లో జయభేరి మోగించటం ఆ విజయోత్సవానికి కారణం. 250 స్థానాలున్న పార్లమెంటుకు పన్నెండేళ్ల క్రితం అధికారంలోకొచ్చిన ప్రస్తుత అధ్యక్షుడు అలెక్సాండర్ వూచిచ్ ఆ పక్కనున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఆదర్శంగా తీసుకుని రెండుసార్లు అధ్యక్షుడిగా పనిచేసి, మూడోసారికి కుదరదు గనుక ప్రధానిగా తిరిగొద్దామని ఎత్తుగడ వేశారు. కానీ తన పొరుగునున్న హంగేరీ అధ్యక్షుడు విక్టర్ ఒర్బాన్‌కు ఏమైందో గమనించుకోలేదు. తన మాదిరే ఎన్నికల సంఘం మొదలుకొని న్యాయవ్యవస్థ, మీడియా, పారిశ్రామికరంగం వరకూ అన్నిటినీ అధీనంలోకి తెచ్చుకుని తిరుగులేని అధికారం చలాయించిన ఒర్బాన్ పదహారేళ్ల అనంతరం మొన్న మే నెలలో పదవీచ్యుతుడయ్యారు. దాన్నుంచి వూచిచ్ ఏమీ నేర్చుకోలేదు సరిగదా... అవినీతి భూతాన్ని అదుపు చేద్దామన్న స్పృహ కూడా కొరవడింది.శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లో యువతరం హింసామార్గానికి మళ్లింది. అధికార సౌధాలపై దాడులకు దిగింది. పాలకుల్ని తరిమికొట్టింది. కానీ సెర్బియా యువతరం ఇందుకు భిన్నం. ప్రభుత్వం ఎంత రెచ్చగొట్టినా శాంతియుత మార్గాన్ని వీడలేదు. అందుకే రెండేళ్లనుంచి ఉద్యమం నిలకడగా సాగింది. దాన్ని అణిచేయటానికి వూచిచ్ చేయని ప్రయత్నమంటూ లేదు. తుపాకుల ప్రయోగం మినహా చేయాల్సిందంతా చేశారు. రాత్రి వేళల్లో అరెస్టులు, లాఠీచార్జిలు, పెప్పర్ స్ప్రే ప్రయోగాలు, ఉద్యమవేదికల్ని హఠాత్తుగా నిషేధిత ప్రాంతాలుగా ప్రకటించటం వగైరాలన్నీ ఉపయోగించారు. మాఫియా ముఠాలను రంగంలోకి దించారు. చురుగ్గా పనిచేసే నేతల్ని బెదిరించటం, దౌర్జన్యానికి దిగటం, ప్రధాన నగరాల్లో ప్రభుత్వ భవనాల దరిదాపుల్లోకొచ్చే యువకుల్ని బెదర గొట్టడం, ఇళ్లకు వెళ్లి చంపేస్తామని బెదిరించటం ఈ ముఠాల పని. ఉద్యమ నేతలను విదేశీ శక్తుల కిరాయిమనుషులుగా అనుకూల మీడియా సాగించిన ప్రచారం... ఉద్యమ కారుల బంధుమిత్ర గణం ద్వారా జనానికి చేరే సమాచారం ముందు వీగిపోయింది. విద్యార్థులు స్టూడెంట్ లిస్ట్ నేతలుగా వెలిగిపోవాలనుకోలేదు. నిజానికి 250 మంది జాబితాలో ఒక్క విద్యార్థి కూడా లేడు. రైతుల్ని, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లను, నటుల్ని, ఒపేరా గాయకుల్ని, క్రీడాకారుల్ని, వైద్యరంగ నిపుణుల్ని అభ్యర్థులుగా ఎంపిక చేసు కున్నారు. సంప్రదాయ పద్ధతుల్లో పార్టీ నెలకొల్పాలా వద్దా అని ఊగిసలాడినా చివరకు వివిధ నగరాలు, పట్టణాల్లోని కూడళ్లలో తరచు చర్చావేదికలు నిర్వహిస్తూ వచ్చారు. అక్కడే విధానాలు ఖరారయ్యేవి. ఆ విధానాలే ఇప్పుడు విజయాన్నిచ్చాయి. అయితే వూచిచ్ ఇంత త్వరగా పదవినుంచి తప్పుకుంటారని వారనుకోలేదు. బహుశా ఇదే బెల్‌గ్రేడ్‌లో 1903లో తన పేరేగల రాజుపై సైన్యం తిరుగుబాటుచేసి ఆయన్ని కిటికీ నుంచి విసిరేయడం గుర్తొచ్చి ఉండాలి. సైన్యం బలంతో అధికారానికి అంటిపెట్టుకుంటే కష్టాలు చవిచూడాల్సి వస్తుందని వూచిచ్ సరిగానే అంచనా వేసుకున్నారు.ఇంతకూ ఓడింది బ్రెజిల్‌లో మాదిరే మితవాద, జాతీయవాద పక్షమైనా... నెగ్గిందెవరో చెప్పటం అంత సులభం కాదు. వారు ఉదారవాదులనీ, అమెరికా డీప్ స్టేట్ ఏజెంట్లనీ వూచిచ్ ప్రచారం చేశారు. అటు ట్రంప్‌కు సైతం అలాంటి ఆశ ఉంది. బెల్‌గ్రేడ్‌లో ట్రంప్ టవర్‌కు వూచిచ్ అనుమతించకపోవడం ఆయనకు ఆగ్రహం కలిగించింది. కానీ స్టూడెంట్ లిస్ట్ అంత తేలిగ్గా అమెరికాను అక్కున చేర్చుకునే రకం కాదు. వారు మౌలికంగా ప్రజాస్వామికవాదులు. జాతీయవాదం తమలో ఏం తక్కువలేదని ఉద్యమ సందర్భంలో చాటారు. యూరోప్ యూనియన్(ఈయూ)లో చేరతామంటూనే సెర్బియా రష్యా వైపు మొగ్గడం ఆ సంస్థకు నచ్చలేదు. స్టూడెంట్ లిస్ట్ పార్టీకి ఈయూపై ఆసక్తే లేదు. మొత్తానికి నిలకడగా, సూత్రబద్ధంగా పోరాడి సాధించిన విజయం పాలనలో ఎన్నెన్ని మలుపులు తిరుగుతుందో వేచి చూడాలి.

ఆంధ్రప్రదేశ్ తీరాన్ని వణికించిన అర్నబ్

మొదటిపేజీ తరువాయి - కారైకాల్‌లలో నేటి నుంచి నవంబర్ 3 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అనకాపల్లి, విశాఖపట్నం, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కృష్ణ, బాపట్ల జిల్లాల్లో గంటకు 110-120 కిలోమీటర్ల వేగంతో గరిష్టంగా 130 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తున్నాయి. సాయంత్రానికి 70నుంచి 80 కిలోమీటర్ల వేగానికి తగ్గి, రాత్రికి 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో శీతల గాలులుగా మారుతాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాల్లో అలల ఉద్ధృతి మీటరు వరకు ఎగసిపడుతున్నాయన్నారు. ఇదిలా ఉండగా అర్నబ్ తుపాను ఉభయగోదావరి జిల్లాలతో పాటు, ఉత్తరాంధ్రలో బీభత్సం సృష్టించింది. ఈదురుగాలుల తీవ్రతకు పలు చోట్ల చెట్లు, విద్యుత్తు స్తంభాలు కూలిన ఘటనల్లో ఆరుగురు మృతి చెందారు. విశాఖ పాత గోశాల సమీపంలో విద్యుత్తు స్తంభం కూలి మహిళ మృతి చెందగా, విశాఖ బాలాజీనగర్‌లో విద్యుత్ స్తంభం కూలి కె.మాధవి దుర్మరణం చెందారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు.భీమవరంలోని చర్చి వద్ద చెట్టు విరిగిపడి చొక్కా కిషోర్ (45) మృతి చెందగా, బొండాడవారివీధిలో విద్యుత్తు స్తంభం విరిగిపడి రాంబాబు (34) మృతి చెందారు. ఈదురుగాలుల ధాటికి భీమవరంలో దుకాణాలు, ఇళ్లు ధ్వంసమయ్యాయి. కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలోని ప్రకాష్‌పురంలో వృద్ధురాలు మృతి చెందారు. అదే జిల్లాలో ఈదురుగాలులు, వర్షానికి గుడిసె కూలి కొల్లు వెంకాయమ్మ దుర్మరణం చెందారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో ఈదురుగాలులకు విద్యుత్తు తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. ఉదయాన్నే ప్రమాదవశాత్తూ ఇంటి ముందు ఉన్న విద్యుత్తు తీగలు తగిలి మహిళ మృతి చెందారు.

తుపాను పరిస్థితిపై సీఎం చంద్రబాబు సమీక్ష

మొదటిపేజీ తరువాయి - తీసుకుంటున్న చర్యల గురించి ఆర్టీజీఎస్ అధికారులు ముఖ్యమంత్రికి సమగ్రంగా వివరించారు. తుపాను కారణంగా పలుచోట్ల చెట్లు కూలిపోయిన నేపథ్యంలో ఎక్కడైనా ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయా అని సీఎం ఆరా తీశారు. జాతీయ రహదారులతో పాటు ఇతర మార్గాల్లో విరిగిపడిన చెట్లను తక్షణమే తొలగించి, రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు.తుపాను హెచ్చరికలు వచ్చినప్పటి నుంచి ఆర్టీజీఎస్ ద్వారా నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ముఖ్యమంత్రికి తెలిపారు. అదేవిధంగా ప్రజల నుంచి 'మనమిత్ర' యాప్ ద్వారా వస్తున్న ఫిర్యాదులను సంబంధిత అధికారులకు చేరవేసి, సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్లు అధికారులు వివరించారు. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండి, సహాయక చర్యలను వేగవంతం చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు.

బ్యాలెట్‌తో ఎన్నికలు జరిగినా ఓటమి తప్పలేదుగా

మొదటిపేజీ తరువాయి - రాష్ట్రాల్లో మొత్తం 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ 12 స్థానాల్లో పోటీ చేసింది. గతంలో ఆ పార్టీ గెలిచిన నాలుగు స్థానాలు కూడా ఈ ఎన్నికల్లో ఉన్నాయి. అయినా ఈసారి ఒక్క చోటా విజయం సాధించలేకపోయింది. కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు సీటు దక్కకపోవడం గట్టి ఎదురుదెబ్బగా మారింది. ఈ ఫలితాలను ప్రస్తావిస్తూ మోదీ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఓటింగ్ యంత్రాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ గతంలో ఆరోపణలు చేసింది. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని కూడా కోరింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతోనే జరిగాయని మోదీ గుర్తుచేశారు. అయినా కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదంటూ పరోక్షంగా ఎద్దేవా చేశారు.

తెలంగాణలో 'ఏఐ సాక్షమ్'



మొదటిపేజీ తరువాయి - వేగం పెంచి, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైతులు, పింఛనుదారులు వంటి వారు పడేపడే ఆఫీసుల చుట్టూ తిరిగే దుస్థితికి చరమగీతం పాడాలన్నారు. ప్రభుత్వ నిధుల వినియోగం, సంక్షేమ పథకాలు అర్హులకు చేరుతున్నాయా లేదా అనే విశ్లేషణ, విద్యుత్ డిమాండ్ అంచనా వంటి పనులకు ఏఐ ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు.అదే సమయంలో ఏఐ వినియోగంలో పలు జాగ్రత్తలు తప్పనిసరి అని భట్టి నొక్కిచెప్పారు. ఏఐ అందించిన సమాచారాన్ని అధికారులు కచ్చితంగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తామని, ఏఐ నిర్ణయాలపై మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. చిన్నస్థాయి ప్రయోగాలు విజయవంతమైన తర్వాతే ఏఐ వ్యవస్థలను విస్తరించాలని, ఏవైనా లోపాలు జరిగితే బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని అన్నారు. ప్రజలకు అందే వేగవంతమైన, పారదర్శక సేవలే ఏఐ విజయానికి గీటురాయి అవుతాయని ఆయన పేర్కొన్నారు.

ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వాయిదా

మొదటిపేజీ తరువాయి -

సంస్థల ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీల్లో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేశారు. యథావిధిగా నవంబర్ 1న పోలింగ్, నవంబర్ 3న ఓట్ల లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు.అయితే ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 3న పరిషత్ పోలింగ్ జరగాల్సి ఉంది. అయితే అదే రోజున పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఒకే రోజున పట్టణ స్థానిక సంస్థల కౌంటింగ్, గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్ రెండూ ఏకకాలంలో నిర్వహిస్తే క్షేత్రస్థాయిలో తీవ్రమైన ఇబ్బందులు తలెత్తుతాయని ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులు లోతుగా విశ్లేషించారు. అంతేకాక జిల్లాల్లో తగినంత మంది పోలీస్ బలగాలు, మైక్రో అబ్జర్వర్లు, పోలింగ్ సిబ్బందిని రెండు వేర్వేరు భారీ కార్యక్రమాలకు ఒకే సమయంలో కేటాయించడం కష్టసాధ్యమని గుర్తించారు.ఈ క్రమంలోనే ఎన్నికల నిర్వహణపరంగా తలెత్తే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పరిషత్ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలు వాయిదా వేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) భావించింది. ఈ మేరకు పరిపాలన పరమైన ఇబ్బందులు, భద్రతా సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని తేదీల్లో సవరణ చేస్తున్నట్లు ప్రకటించింది. ఎక్కడా ఎలాంటి లోపాలకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.జిల్లా, మండల పరిషత్‌లకు సవరించిన తేదీ ప్రకారం నవంబర్ 5న ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఒకవేళ రీపోలింగ్ అవసరమైతే నవంబర్ 6న ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపు నవంబర్ 7న ఉండనుంది. మరోవైపు శాంతిభద్రతల పరిరక్షణ, మావోయిస్టు ప్రభావిత, సమస్యాత్మక ఏజెన్సీ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా కొన్ని ప్రత్యేక ప్రాంతాల్లో మాత్రం పోలింగ్ సమయాన్ని కుదించారు. ఈ ప్రాంతాల్లో చీకటి పడేలోపు పోలింగ్ సిబ్బంది, సామగ్రి సురక్షిత ప్రాంతాలకు చేరేలా నిర్ణీత సమయం కంటే ముందే, అంటే సాయంత్రం మూడు గంటలకే పోలింగ్ ముగియనుంది.ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 10 మండలాల పరిధిలో 44 అత్యంత సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలు, పోలవరం జిల్లాలోని ఏడు మండలాల పరిధిలోని 44 సున్నితమైన పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు గుర్తించింది. ఈ రెండు జిల్లాల పరిధిలోని 88 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్, రీ-పోలింగ్ ప్రక్రియలు సాయంత్రం మూడు గంటలకే ముగియనుంది. ఈ ప్రాంతాల ఓటర్లు ఈ విషయాన్ని గమనించి, ఎలాంటి గందరగోళానికి గురికాకుండా నిర్ణీత సమయంలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ అమూల్యమైన ఓటు హక్కును వృథా కాకుండా వినియోగించుకోవాలని కోరింది.ఎన్నికల తేదీల్లో తలెత్తిన ఈ సవరణలను అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఓటర్లు గమనించి, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి సహకరించాలని ఎస్ఈసీ విజ్ఞప్తి చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లేలా, ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును ఉపయోగించుకునేందుకు వీలుగా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొంది.

స్పెయిన్‌లో ఘోర రైలు ప్రమాదం.. రెండు హైస్పీడ్ రైళ్లు ఢీ

మొదటిపేజీ తరువాయి - హైస్పీడ్ రైళ్లు ఢీకొన్న ఘటనలో 64 మంది మృతిచెందారు. పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. మూడు బోగీలు పట్టాలు తప్పగా, రెండు బోగీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారుఈ ఘటనపై స్పెయిన్ ప్రధానమంత్రి స్పందించారు.స్పెయిన్ రైల్వే నిర్వహణ సంస్థ ఏడీఐఎఫ్ తెలిపిన వివరాల ప్రకారం, దేశంలోని మధ్య ప్రాంతమైన టొలెడో ప్రావిన్స్‌లో ఈ ప్రమాదం జరిగింది. బుధవారం మాడ్రిడ్ నుంచి నైరుతి ప్రాంతంలోని సెవిల్లెకు వెళ్తున్న రెండు హైస్పీడ్ రైళ్లు ఒకే దిశలో ప్రయాణిస్తున్నాయి. వీటిలో ఒక రైలు ఆగి ఉండగా, వెనుక నుంచి వచ్చిన మరో రైలు దాని వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు బోగీలు పట్టాలు తప్పాయి. ఢీకొన్న తీవ్రతకు ఓ బోగీ పూర్తిగా ధ్వంసమై, దాని విడిభాగాలు సమీపంలోని వాలులో చెల్లాచెదురుగా పడిపోయాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. రెండు రైళ్లలో కలిపి 500 మందికిపైగా ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మూడు బోగీలు చెల్లాచెదురుగా పడి ఉన్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ప్రమాద తీవ్రత దృష్ట్యా మూడు హెలికాప్టర్లు, రెండు మొబైల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లను ఘటనా స్థలినికి పంపినట్లు ఓ అధికారి వెల్లడించారు. క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు స్పోర్ట్స్ పెవిలియన్‌ను సిద్ధం చేశామని ఉర్దా మేయర్ తెలిపారు.ఈ ప్రమాదంతో మాడ్రిడ్ -అండలూసియా మధ్య రైళ్ల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. ప్రయాణికులకు అవసరమైన సహాయం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఐఆర్‌వో సంస్థ కూడా తన భద్రతా ప్రోటోకాల్‌లను అమల్లోకి తెచ్చి, అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గురైన రైళ్లలో ఒకటి ప్రభుత్వ రంగ సంస్థ రెన్ఫేకు చెందినది కాగా, మరొకటి ప్రైవేటు సంస్థ ఐఆర్‌వోకు చెందినది. రెన్ఫే రైలులో 397 మంది, ఐఆర్‌వో రైలులో 147 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.స్పెయిన్ ఆరోగ్యశాఖ మంత్రి మోనికా గార్సియా తెలిపిన వివరాల ప్రకారం, అత్యంత తీవ్రంగా దెబ్బతిన్న రెండు బోగీల్లో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావడంపై సహాయక బృందాలు దృష్టి సారించాయి. క్షతగాత్రులను సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఢీకొన్న వేగం, తీవ్రతను బట్టి చూస్తే ఇది పెను విషాదంగా మారే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, అత్యవసర సేవల బృందాలతో పాటు సైనిక అత్యవసర విభాగాన్ని కూడా ప్రమాద స్థలానికి పంపించారు. క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు ఉర్దా పట్టణంలోని క్రీడా ప్రాంగణాన్ని సిద్ధం చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు.ఈ ఘటనపై స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంపై దృష్టి సారించేందుకు తన అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. బాధితులకు సహాయం అందించేందుకు అత్యవసర సిబ్బంది సంఘటనా స్థలంలో పనిచేస్తున్నారని తెలిపారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. కాస్టిల్లా-లా మాంచా ప్రాంత అధ్యక్షుడు ఎమిలియానో గార్సియా-పేజ్ కూడా ప్రమాద స్థలానికి బయలుదేరినట్లు వెల్లడించారు.స్పెయిన్‌లో ఈ ఏడాది జరిగిన రెండో పెద్ద రైలు ప్రమాదం ఇది. జనవరిలో దక్షిణ స్పెయిన్‌లో రైలు పట్టాలు తప్పి ఎదురుగా వస్తున్న మరో రైలును ఢీకొన్న ఘటనలో 45 మంది ప్రాణాలు కోల్పోయారు. 2013లో జరిగిన రైలు ప్రమాదంలో 80 మంది మృతి చెందగా, ఆ తర్వాత దేశంలో అత్యంత ప్రాణాంతకమైన రైలు ప్రమాదాల్లో జనవరి ఘటన ఒకటిగా నిలిచింది. తాజా ప్రమాదంతో స్పెయిన్ హైస్పీడ్ రైలు వ్యవస్థ భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి - ముఖ్యంగా విద్యుత్ పునరుద్ధరణ పనులకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు.తుపాను తీవ్రత, ఏపీలో జరిగిన నష్టం గురించి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో నష్టాన్ని తగ్గించడానికి, వీలైనంత త్వరగా పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి చేపడుతున్న చర్యలను మంత్రి గొట్టిపాటి ఆయనకు వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి తెలిపారు.ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం అవసరమైతే సిబ్బందిని, అవసరమైన సామగ్రిని పంపడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ హామీతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు మరింత వేగవంతం అవుతాయని భావిస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం అందించిన సహాయ హస్తానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలుస్తామన్న భట్టి విక్రమార్కకు, తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఈ సహకారం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అంతకుముందు, తుపాను సహాయక చర్యల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 6,000 మంది అనుభవజ్ఞులైన సిబ్బందిని రంగంలోకి దించినట్లు గొట్టిపాటి తెలిపారు. తుఫాను పునరుద్ధరణ పనుల్లో అనుభవం ఉన్న అధికారులు, ఫీల్డ్ సిబ్బందిని అత్యవసర సేవల కోసం సిద్ధం చేశామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో డైరెక్టర్ల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన వివరించారు.

తెలంగాణ రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది

మొదటిపేజీ తరువాయి - రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.హైదరాబాద్‌లోని వాలంతరిలో మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డిలను పోలీసులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసంలో గృహ నిర్బంధం చేశారు. తెల్లవారుజాము నుంచే వారి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు.ఈ ఘటనపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. "కరవుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం, రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతోంది" అని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన ముసుగులో జరుగుతున్న దోపిడీ యత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా అరెస్టులను ఖండించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని, మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నందుకే తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. గృహనిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని పార్టీ తరపున డిమాండ్ చేశారు.

తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

మొదటిపేజీ తరువాయి - ఈ మేరకు పలువురు అధికారులకు కొత్త పోస్టింగులు కేటాయిస్తూ పరిపాలనలో మార్పులు చేపట్టింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, సీనియర్ ఐపీఎస్ అధికారి జయేష్ రంజన్‌ను పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్ రాజ్‌కు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖల బాధ్యతలను నవీన్ మిట్టల్‌కు కేటాయించారు.ఇక రెవెన్యూ (దేవాదాయ) శాఖకు శైలజ రామయ్యర్‌ను, క్రీడలు మరియు వారసత్వ శాఖకు ఎ. వాణి ప్రసాద్‌ను బదిలీ చేశారు. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ కార్యదర్శిగా కె. ఇలంబర్తి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శిగా ముషారఫ్ అలీ ఫరూఖీ నియమితులయ్యారు. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల అదనపు బాధ్యతలను సర్ఫరాజ్ అహ్మద్‌కు కేటాయించారు.మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ బాధ్యతలను శ్రుతి ఓఝాకు అప్పగించగా, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ సంగీత సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించనున్నారు. టీజీఎస్పీడీసీఎల్, టీజీఆర్డ్కో బాధ్యతలను జితేష్ వి. పాటిల్‌కు కేటాయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ ఉత్తర్వులు జారీ చేశారు.

శిక్షణ కోసం భారత్ వైపు జపాన్ చూపు

మొదటిపేజీ తరువాయి - భారత్, జపాన్ మధ్య రక్షణ సంబంధాలు మరింత బలపడుతున్నాయి. తమ సైన్యానికి అత్యాధునిక క్షిపణుల వినియోగంపై శిక్షణ ఇచ్చేందుకు భారత్‌లోని శిక్షణా కేంద్రాలను వినియోగించుకోవాలని జపాన్ భావిస్తోంది. ఈ మేరకు తమ సిబ్బందిని చర్చల కోసం భారత్‌కు పంపినట్లు జపాన్ గ్రౌండ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ (జీఎస్‌డీఎఫ్) చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ మసయోషి అరాయ్ స్వయంగా వెల్లడించారు.సుమారు 1,000 కిలోమీటర్ల పరిధి కలిగిన ఉపరితలం నుంచి నౌకలను ఛేదించే క్షిపణులపై సమర్థవంతమైన శిక్షణ ఇవ్వడం తమకు పెద్ద సవాలుగా మారిందని జనరల్ అరాయ్ తెలిపారు. ఈ నేపథ్యంలో దేశీయంగా, విదేశాల్లో శిక్షణా అవకాశాలను పరిశీలిస్తున్నామని, ఇందులో భాగంగానే భారత్

పేదింటి బిడ్డకు ఎంబీబీఎస్ సీటు

పామిడి, అక్టోబర్ 28, దరువు న్యూస్ :



పేదరికం అడ్డం కాదని నిరూపిస్తూ ఓ నిరుపేద కుటుంబానికి చెందిన పామిడి మండలంలోని పి.కొండాపురం గ్రామానికి చెందిన ఎస్సీ మాదిగ కులానికి చెందిన టైలర్ మండ్ల మారెన్న కుమార్తె మండ్ల మౌనిక ఎంబీబీఎస్ సీటు సాధించడం పట్ల గ్రామంలో ఆనందోత్సవాలు వెల్లివిడిచాయి. విద్యార్థిని సాధించిన ఈ ఘనత పట్ల తల్లిదండ్రుల కుటుంబ సభ్యులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు కష్టపడి చదివి వైద్య విద్యలో ప్రవేశం పొందినందుకు పలువురు అభినందనలు తెలియజేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైన పట్టుదలతో చదివి చిత్తూరు జిల్లా పుత్తూరు గౌరీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించడం ఎంతో గర్వకారమని గ్రామస్తులు పేర్కొన్నారు. విద్యార్థిని సాధించిన విజయం గ్రామంలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేద కుటుంబాల పిల్లలు సైతం కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరని అన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు ఆనంద వ్యక్తం చేస్తూ తమ బిడ్డ వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి మంచి వైద్యురాలుగా ఎదగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో తమ బిడ్డలకు ఆర్థికంగా వెనుకబడిన వారికి అండగా నిలిచి సేవాభావంతో వైద్యం అందించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఎంపీటీసీ హరిజన రవిని సన్మానించిన కత్తిమల ప్రభాకర్



పామిడి, అక్టోబర్ 28, దరువు న్యూస్ :

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా పామిడి రెండవ ఎంపీటీసీగా హరిజన రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కత్తిమల ప్రభాకర్ ఆయనను ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. పామిడి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కత్తిమల ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎంపీటీసీగా ఎన్నికైన హరిజన రవి ప్రజల సమస్యలపై దృష్టి సారించి, మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రజల అవసరాలను ప్రాధాన్యంగా గుర్తించి పనిచేయాలని ఆయన సూచించారు. హరిజన రవి ఈ అవకాశానికి కృతజ్ఞతలు తెలిపి, తాను అందరి సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ నగరపంచాయతీ చైర్మన్ గౌస్ పీరా, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ సభ్యులు రాజగోపాల్, బాబు, హుసేన్ పీరా, రఘు, శీనా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన జిట్టా రామ్మోహన్ యాదవ్

- బీసీల అభ్యున్నతి, ప్రజాసేవే లక్ష్యంగా బీజేపీలో చేరిక

అనంతపురం, అక్టోబర్ 28, దరువు న్యూస్ :



అనంతపురం జిల్లాకు చెందిన జిట్టా రామ్మోహన్ యాదవ్ నిన్న భారతీయ జనతా పార్టీలో చేరారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య సమక్షంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ సమక్షంలో, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందింటి శ్రీనివాసులు, బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు కొనుకుంట్ల రాజేష్, రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు మారేష్‌ల ఆధ్వర్యంలో ఆయన బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా జిట్టా రామ్మోహన్ యాదవ్ మాట్లాడుతూ.. బీసీ వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం, పేద ప్రజల సంక్షేమం, యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించడం వంటి లక్ష్యాలతో ప్రజాసేవలో మరింత చురుకుగా పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అనంతపురం జిల్లాలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, పార్టీ నాయకత్వం అప్పగించే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ముఖ్యంగా బీసీ వర్గాల అభివృద్ధికి, అణగారిన వర్గాల సంక్షేమానికి, యువతకు అండగా నిలవడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పార్టీ నాయకత్వం, సీనియర్ నాయకుల మార్గదర్శకత్వంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, అనంతపురం జిల్లా అభివృద్ధి కోసం పనిచేస్తానని జిట్టా రామ్మోహన్ యాదవ్ స్పష్టం చేశారు.

పామిడి జడ్పీటీసీ, ఎంపీటీసీలకు యువనేత గుమ్మనూరు ఈశ్వర్ ఘన సత్కారం

పామిడి, అక్టోబర్ 28, దరువు న్యూస్ : పామిడి మండల జడ్పీటీసీగా ఏకగ్రీవంగా ఎన్నికైన పల్లె శ్రీనివాసులతో పాటు, పామిడి మండలం, పట్టణానికి చెందిన 14 మంది ఎంపీటీసీలను యువనేత, గుత్తి, పామిడి ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీలను శాలువా కప్పి, పూలమాలతో మర్యాదపూర్వకంగా సన్మానించారు. గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, యువనేత గుమ్మనూరు ఈశ్వర్‌తో ఎన్నికైన ప్రతినిధులు ఆత్మీయంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ.. ఎన్నికైన ప్రతినిధులు తమ కర్తవ్యాన్ని నిజాయితీగా, నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. ప్రజల సమస్యలపై స్పందించి, ఎల్లప్పుడూ వారికి అందుబాటులో ఉండాలని, మండల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు. పామిడి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల తర్వాత జరిగిన ఈ సత్కార కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎన్నికైన ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.

కూటమి అరాచక పాలనకు ఓటు వేయకండి

- పార్లమెంట్ పరిశీలకులు నరేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం, అక్టోబర్ 28, దరువు న్యూస్ :





గత రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ పరిశీలకులు నరేష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిలు విమర్శించారు. ప్రజలు ఇప్పటికైనా మేల్కొని, ఓటు ద్వారా కూటమికి బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. వైసీపీ మేయర్ అభ్యర్థి సి.రమేష్ గౌడ్, 37వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి బలరాం రావు, 38వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి సందీప్ లను గెలిపించాలని జిల్లా అధ్యక్షులు అనంత వెంకట రామిరెడ్డి, మాజీ మంత్రి సాకే శైలజనాథ్, వైసీపీ సీనియర్ నాయకులు ప్రజలు కోరారు. అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో నరేష్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ విధానాలు ప్రజలకు నష్టం కలిగిస్తున్నాయని ఆరోపించారు. నగరాభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతపురం మేయర్ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సి.రమేష్ గౌడ్‌ను, అలాగే వివిధ డివిజన్లలో పోటీ చేస్తున్న కార్పొరేటర్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నరేష్ రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీకి విజయం అందించాలని పార్టీ నాయకులు ప్రచారంలో పిలుపునిచ్చారు. వైసీపీ అభ్యర్థుల విజయంతోనే అనంతపురం నగరం అభివృద్ధి పథంలో సాగుతుందని, స్థానిక సమస్యలపై శాశ్వత పరిష్కారాలు సాధ్యమవుతాయని తెలియజేశారు. ఎన్నికల్లో ప్రతి ఓటరూ తన ఓటు హక్కును వినియోగించుకోవాలని కూడా విజ్ఞప్తి చేశారు. అనంతపురం నగరంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మేయర్, కార్పొరేటర్ అభ్యర్థుల గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. మేయర్ అభ్యర్థి సి.రమేష్‌తో కలిసి వివిధ డివిజన్లలో ప్రచారం నిర్వహించారు.

రోబోటిక్ న్యూరోసర్జరీతో సంక్లిష్ట మెదడు శస్త్రచికిత్సల్లో కొత్త అధ్యాయం

అనంతపురం, అక్టోబర్ 28, దరువు న్యూస్ :



భారతదేశంలో మూడవ ఏకైక బ్రెయిన్ రోబోట్‌ను కలిగి ఉన్నందుకు సికింద్రాబాద్‌లోని యశోద హాస్పిటల్స్ గర్విస్తోంది. ఈ బ్రెయిన్ రోబోట్, శస్త్రచికిత్స ప్రక్రియ అంతటా సర్జన్‌కు నిరంతరం ఫీడ్‌బ్యాక్ ఇస్తూ, న్యూరోసర్జన్‌కు ఒక జీపీఎస్ లాగా పనిచేస్తుంది. ఈ ఫంక్షన్, మెదడులోని లోతైన కణితులపై కీ హోల్ ద్వారా అత్యంత కచ్చితత్వంతో ఆపరేషన్ చేయడానికి మాకు వీలు కల్పిస్తుంది. ఇది బ్రెయిన్ ట్యూమర్ల విషయంలో భద్రతా ప్రమాణాలను అత్యున్నత స్థాయికి పెంచుతుంది.

సంక్లిష్టమైన బ్రెయిన్ ట్యూమర్లు : సంక్లిష్టమైన బ్రెయిన్ ట్యూమర్లలో మంచి ఫలితాలతో సురక్షితమైన శస్త్రచికిత్స చేయడానికి ఇది అనుకూలంగా ఉంటుంది. ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ, ఇంట్రా ఆపరేటివ్ మానిటరింగ్, న్యూరోనావిగేషన్, హై ఎండ్ మైక్రోస్కోప్, ఎండోస్కోప్ వంటి సౌకర్యాలు మరియు సర్జన్ యొక్క అనుభవం కలిసి అనుకూలమైన ఫలితాన్ని సాధించడానికి గొప్ప సహాయకాలుగా పనిచేస్తాయి. ముక్కు ద్వారా లేదా కీ-హోల్ విధానంతో చికిత్స చేసే బ్రెయిన్ ట్యూమర్లు లేదా వ్యాధుల కోసం ఇది ఒక ప్రత్యేకమైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్. ఈ కేంద్రం పిట్యూటరీ అడినోమా, క్రానియోఫారింగియోమా, స్కల్ బేస్ మెనింగియోమా, క్రోమా, కాండ్రోసార్కోమా, సీఎస్ఎఫ్ రైనోరియా కోసం స్కల్ బేస్ రిపేర్, స్కల్ బేస్ ఆస్టియోమైలైటిస్ వంటి వాటికి సంపూర్ణ పరిష్కారాలను అందిస్తుంది. ట్రైజెమినల్ న్యూరాల్జియా, హెమీ ఫేషియల్ వాసోస్పాజం కోసం చేసే ఎండోస్కోపిక్ మైక్రోవాస్కులర్ డీకంప్రెషన్, న్యూరో ఎండోస్కోపీలో ఈ అత్యుత్తమ కేంద్రం యొక్క ముఖ్యాంశాలలో ఒకటి. అనంతపురంలో యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డా .అయ్యదురై న్యూరో సర్జరీ డా. విశ్వనాథ్ ఎస్ బైర్ న్యూరో అనస్థీషియా మేనేజర్లు బి.సుదర్శన్ రెడ్డి, సూర్వీ రాజేశ్, ఖన్నా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పుట్టపర్తిలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు

పుట్టపర్తి, దరువు న్యూస్: త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం పుట్టపర్తి పట్టణంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీఎస్పీ మాణిక్యరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐలు యువరాజు, శ్రీనివాసులు, రాజశేఖర్‌తో పాటు సబ్ డివిజన్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ, మహిళా పోలీసులు పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల భద్రతలో భాగంగా డ్రోన్ కెమెరాలతోనూ పట్టణంలోని పరిస్థితులను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.



అనంతపురం జిల్లాలో మూడు జెడ్పీటీసీ స్థానాలు టీడీపీ ఏకగ్రీవం

ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులకు ధ్రువపత్రాల అందజేత

అనంతపురం, దరువు న్యూస్: అనంతపురం జిల్లాలో మూడు జెడ్పీటీసీ స్థానాలను తెలుగుదేశం పార్టీ (టీడీపీ) అభ్యర్థులు ఏకగ్రీవంగా కైవసం చేసుకున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని సీఈవో ఛాంబర్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులకు విజయలక్ష్మి ఎన్నిక ధ్రువపత్రాలను అందజేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. గుంతకల్లు నియోజకవర్గంలోని గుత్తి మండలం నుంచి నల్లబోతుల స్వాతి, పామిడి మండలం అనంపల్లె నుంచి పల్లె శ్రీనివాసులు, గుంతకల్లు మండలం అమీన్‌పల్లె నుంచి డి. గీత జెడ్పీటీసీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ముగ్గురూ టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేసి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి వెల్లడించారు.





పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

అమడగూరు, దరువు న్యూస్ : పుట్టపర్తి నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి, ప్రజల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. బుధవారం అమడగూరు మండలంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ నవంబర్ 5న జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంతో పాటు పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పుట్టపర్తి ప్రాంతంలో యుద్ధ విమానాల తయారీ కేంద్రం, అమడగూరులో రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో భారీ సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు అమలైతే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అమడగూరు మండలంలో సుమారు రూ. 13.52 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలు, ఆరోగ్య కేంద్రాలు తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. పింఛన్ల పెంపు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ వంటి పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు.









కూటమి నేతల్లో ఓటమి భయం

అనంతపురం, అక్టోబర్ 28, దరువు న్యూస్ :

అనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి నేతలకు ఓటమి భయం పట్టుకుందని వైఎస్ఆర్సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచినా రెండున్నరేళ్లలోనే ప్రజాప్రతినిధుల చేసిన అరాచకాలను ప్రజలు గుర్తించారని తెలిపారు. బుధవారం నగరంలోని 44, 42, 43, 40, 41 డివిజన్లలో వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్, వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాశ్ రెడ్డితో కలిసి ఆయా డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థులు నిహార్రెడ్డి, లోకనాథ్రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, లీలావతి, హేమావతి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనా వైఫల్యాలను వివరించారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ.. కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, దీన్ని గ్రహించే అలజడి సృష్టించాలని కుయుక్తులు పన్నుతున్నారని తెలిపారు. అనంతపురం నగర పాలక సంస్థ మేయర్తో పాటు 62 డివిజన్లకు నవంబర్ 1వ తేదీన పోలింగ్ జరగనుందని, ఈ క్రమంలో వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో కూటమి నేతలు ముందుకు వెళున్నారని తెలిపారు. జిల్లా కేంద్రమైన అనంతపురంలో రెండున్నరేళ్లుగా దోపిడీ రాజ్యం కొనసాగుతోందని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రతిపక్షంగా తాము పోరాటం చేస్తున్నామని గుర్తు చేశారు. నగరంలో అధికార పార్టీ నేతలు కబ్జాలకు తెగబడుతుంటే ప్రజలకు అండగా నిలబడ్డామని తెలిపారు. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు భక్షకులుగా మారిపోయారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రజల తీర్పు వ్యతిరేకంగా వస్తుందని గ్రహించి వ్యవస్థలను చేతుల్లోకి తీసుకుంటున్నారని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు.. 2024 నుంచి ఇప్పటి వరకు కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే కూటమే అధికారంలో ఉందని, ఈ సమయంలో వాళ్లు ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. కార్పొరేషన్ ఎన్నికల్లో రిగ్గింగ్ చేసి గెలవాలని మంత్రి సత్యకుమార్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో ఇప్పటి వరకు ఎక్కడా శాంతి భద్రతల సమస్యలు రాలేదని, పోలింగ్ కూడా ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా జిల్లా కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఏ అధికారి అయినా కూటమి నేతలకు కీలుబొమ్మలుగా మారితే తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. ఒక పార్టీకి అనుకూలంగా ఉంటామనే రీతిలో వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా బీజేపీ ప్రకటిస్తున్న హామీలు, వాగ్దానాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. వైసీపీని గెలిపిస్తే ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. వైఎస్ జగన్మోహన్రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో కేంద్రంతో తనకున్న పరిచయాలతో అనంతపురం



ప్రభుత్వ సర్వజనాస్పత్రి విస్తరణ పనులను రూ.300 కోట్లతో శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. అందుకు అవసరమైన స్థలాలు సేకరించి నిర్మాణాలు కూడా చేపట్టామని తెలిపారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎందుకు ఆస్పత్రి విస్తరణ పనులు నిలిచిపోయాయో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సమాధానం ఇవ్వాలన్నారు. ఈ పనులను అతీగతీలేకుండా వదిలేసి ఇప్పుడు అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ అంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. రెండున్నరేళ్లుగా అనంతపురం ఎమ్మెల్యే దౌర్జన్యాలు చేస్తుంటే ప్రజలకు ఎందుకు అండగా ఉండలేకపోయారని ప్రశ్నించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. మరోసారి మోసపోతే అనంతపురం నగరం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తుందని తెలిపారు. అనంతపురం నగర అభివృద్ధి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. మేయర్ అభ్యర్థి రమేష్గౌడ్తో పాటు 62 డివిజన్లలో వైసీపీ, సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

- అధికారాన్ని అడ్డుపెట్టుకుని గెలవాలన్న కుయుక్తులు
- పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్, ఎస్పీలదే
- రెండున్నరేళ్లుగా అనంతపురం ఎమ్మెల్యే దౌర్జన్యాలతో విసుగెత్తిన ప్రజలు
- ఏ డివిజన్కు వెళ్లినా వైఎస్ఆర్సీపీకి అపూర్వ ఆదరణ
- రెండున్నరేళ్లుగా ప్రభుత్వ ఆస్పత్రి విస్తరణ పనులు ఎందుకు పూర్తి చేయలేదు?
- మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్
- అనంతపురంలో ఎమ్మెల్యే అరాచకాలపై ఏనాడైనా స్పందించారా?
- ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలిచింది వైఎస్ఆర్సీపీనే
- ఎన్నికల ప్రచారంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి
- మేయర్ అభ్యర్థి రమేష్గౌడ్తో కలిసి 44, 42, 43, 40, 41వ డివిజన్లలో ప్రచారం
- ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి





నగరంలో హోరెత్తిన కూటమి నాయకుల ప్రచారాలు



అనంతపురం, అక్టోబర్ 28, దరువు న్యూస్ :

అనంతపురం నగరంలో కూటమి నాయకుల ప్రచారాలతో పోరెత్తింది. 52, 58 డివిజన్లలో నిర్వహించిన రోడ్డు షోకి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, పెద్ద మారెప్ప ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచార కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి సంయుక్తంగా పాల్గొన్నారు. 52వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి దలవాయి కుమార్, నరేంద్ర డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి నాగరత్నమ్మ, మేయర్ అభ్యర్థి అజేష్ బాబుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ రోడ్ షోకు వేలాది సంఖ్యలో ప్రజలు, మహిళలు, యువకులు స్వచ్ఛందంగా తరలివచ్చి నేతలకు గజమాలలతో అపూర్వ స్వాగతం పలికారు. ప్రచారం పొడవునా ఎటు చూసినా 'జై చంద్రబాబు, జై మోడీ, జై పవన్ కళ్యాణ్' అనే నినాదాలతో నగర వీధులు హోరెత్తాయి. ఈ ప్రచార కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసిపి అరాచక పాలనలో దాడులు, దౌర్జన్యాలు చేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. అందుకే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి గట్టి తీర్పు ఇచ్చి కూటమి ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్ల వరకు అభివృద్ధి నిధులు తేవడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉంది కాబట్టి నగరంలోనూ ఎన్డీఏ అభ్యర్థులను గెలిపిస్తేనే నిధులు వస్తాయని, వైసిపికి వేసే ఓటు పూర్తిగా వృథా అవుతుందని మంత్రి అన్నారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. ఒక సాధారణ పార్టీ కార్యకర్తగా, క్లస్టర్ ఇన్ఛార్జ్గా పని చేసిన వడ్డెర కులానికి చెందిన దలవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించారన్నారు. ఇది బీసీల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. జగన్ మోహన్ రెడ్డికి రాష్ట్రంలో ఏ ఎన్నికలూ జరగకూడదనే దురుద్దేశం ఉందని, అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో అల్లర్లు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అనంతపురంలో మేయర్ అభ్యర్థిగా అజేష్ బాబు గెలిస్తే నగరానికి ఔటర్ రింగ్ రోడ్డు, ఎయిర్పోర్ట్ కనెక్టివిటీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వస్తాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డును అక్కడి నుండి తొలగించి వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ తెస్తామని, అక్కడ

- 52, 58వ డివిజన్లలో కూటమి నాయకుల భారీ రోడ్ షో
- గజమాలతో ఘన స్వాగతం పలికిన వేలాది మంది ప్రజలు
- కేంద్రం నుంచి నిధులు కావాలంటే ఎన్డీఏని గెలిపించండి : మంత్రి సత్య కుమార్
- అరాచక పాలన మరోసారి రాకూడదన్న అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి
- చెప్పినవి చేశాం, చెప్పనవి కూడా చేశామన్న ఎంపీ బీకే పార్థ
- ఎన్డీఏ పాలన ఉంటేనే.. అభివృద్ధి సాధ్యమన్న .. ఎంపీ అంబికా
- కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం
- ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి





సుందరమైన పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. నగర అభివృద్ధి కోసం అజేష్తో పాటు 62 మంది కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించి 100శాతం స్ట్రైక్ రేట్తో కూటమి ఘనవిజయం సాధించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో అనంతపురం నగరం అత్యంత వేగంగా ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు. కేవలం రహదారులు, డ్రైనేజీలు వంటి కనీస మౌలిక వసతుల కోసమే నగరంలో రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేశామని వెల్లడించారు. నగరం మరింత అభివృద్ధి చెందాలంటే బీజేపీ మేయర్ అభ్యర్థితో పాటు 62 స్థానాల్లో కూటమి గెలవడం చారిత్రాత్మక అవసరమన్నారు. కూటమి అభ్యర్థులు గెలిస్తే నగర రూపురేఖలను పూర్తిగా మారుస్తారని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు అధునాతన పార్కులు నిర్మించి, డంపింగ్ యార్డ్ రహిత అనంతపురాన్ని చూపిస్తామని హామీ ఇచ్చారు. హిందూపురం ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ.. తాము ఎన్నికల ముందు చెప్పిన హామీలే కాకుండా, చెప్పని హామీలను సైతం నెరవేరుస్తున్నామని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రాకెట్ వేగంతో సాగుతున్నాయన్నారు. అనంతపురం జిల్లాకు కీలకమైన హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు కాలువ విస్తరణ పనులను రూ.3,500 కోట్లతో చేపట్టి నాలుగు వేల క్యూసెక్కుల నీరు వచ్చేలా మార్పులు చేశామన్నారు. అంతేకాకుండా జిల్లాకు పెద్ద ఎత్తున పరిశ్రమలను తీసుకువస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. అనంతపురం నగర అభివృద్ధి కోసం మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్తో పాటు 58వ డివిజన్ కూటమి అభ్యర్థి దళవాయి నాగరత్న, 52వ డివిజన్ కూటమి అభ్యర్థి దలవాయి కుమార్లకు మద్దతు తెలపాలని నాయకులు ఓటర్లను కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.